శ్రీ రమణ జ్యోతి | Sri Ramana Jyothi
ఏప్రిల్ 2021 | April 2021

ఈ సంచికలో ... | IN THIS ISSUE ...

1. డా॥ కే.యస్. గారి 81వ ప్రవచనం — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు — మల్లాది ఫణిమాల 12
3. శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్) — జి. శ్రీహరిరావు 19
4. కృతజ్ఞత — డా॥ వి. రామదాస్ మూర్తి 23
5. Valmiki Ramayana — Dr. K. Subrahmanian 30
6. Kavyakantha's Ramana Chatvarimsat — V. Krithivasan 42
7. The Human dimensions of Sri Bhagavan Weep with those who Weep — G. Sri Hari Rao 45
8. The *Mangala Slokam* in Bhagavan's Translation of Vivekachudamani — V. Krithivasan 47

## Events in Sri Ramana Kendram in April 2021

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 19th - Monday - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.

(Devotees may please note that due to Social distancing, satsangs are being held online. For details please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# భారమంతా ఆయనదే

డా॥ కే.యస్. గారి 81వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

ఏ మానవుడూ పరిపూర్ణుడు, కొరతలేని స్వచ్ఛతగల వాడు కాదు; అందరూ తప్పులు చిన్నవో, పెద్దవో చేస్తుంటారు. వాటిని సరిదిద్దుకొనేందుకు ప్రయత్నిస్తుంటాం. ఏ కొద్దికాలం పాటు, నిష్కళంకుడుగా వుండగలిగినప్పటికీ, అది భగవదృప వల్ల మాత్రమే సాధ్యపడుతుంది. ఫలానా మనిషి మంచివాడని ఎవరైనా అన్నారంటే అప్పటి దాకా ఆ వ్యక్తి మంచివాడిగా వున్నాడని అర్థం. ఆ మంచితనం, భగవంతుని దయ వల్లనేగాని ఆ వ్యక్తి యొక్క తెలివితేటల వల్ల కాదని భావించాలి. ఒక్క క్షణంలో మనం అనుకోకుండ చెడ్డ పనిని చేయవచ్చు. అది ఎలా జరిగింది అని జనం అంటారు. దానికి జవాబు లేదు. ఎప్పుడూ నీతిమంతునిగా భావించే వ్యక్తి దొంగతనం చేయచ్చు. అతి సాధువుగా వుండే మనిషి ఎంతో కోపం ప్రదర్శించవచ్చు. ఈ సందర్భాలన్నింటిలో ప్రజలు అలాగ ప్రవర్తించగలరని ఊహించలేము. అందుకే, ఇప్పటి వరకు మనం మంచివారిగా ఉండగలిగితే, అందుకు భగవంతుని కృప కారణమని భావించాలి.

## పరిచయం యొక్క ప్రభావం

మనకు ఎవరైనా మంత్రి పదవిలో వున్నవారు, పరిచయస్థులైతే, ఆ విభాగానికి సంబంధించిన పనులను మనం చేయించు

కోగలం. ఒక మంత్రితో పరిచయము మనకు వున్నదని తెలిస్తే, వాళ్ళంతట వాళ్ళే మనల్ని సమీపించి, ఏ పనినైనా చేసిపెట్టాలా అని ముందుకొస్తారు. అలా మనం పొందే గౌరవం, మనపై మర్యాద వల్ల కాదు. మనకు మంత్రితో పరిచయం వున్న కారణంగా, ఆ మంత్రి సంతోషిస్తాడని భావిస్తారు. ఇక ముఖ్యమంత్రి మనకు తెలిసిన వాడైతే ఏ విభాగంలో పనినైనా చేయించుకోవచ్చు. అంతెందుకు, ఇతర మంత్రులే మనకు సాయం చేయాలని ఆరాట పడతారు. ప్రధాన మంత్రి పరిచయస్తుడైతే, కూడ అదే పరిస్థితి. అధికారంలో వున్న వ్యక్తితో పరిచయం మన గొప్పతనంతో సంబంధం లేకుండ మనకు సహాయకారిగా తోడ్పడుతుంది.

ఇది నిత్యజీవితంలో జరిగే లౌకిక వ్యవహారం. అలాగే మనం సదా భక్తుల సాంగత్యంలో వుంటే, మనం ఎల్లప్పుడూ దేవుని సన్నిధిలో వున్నట్లే. అందుకే మనకు శక్తి దేవుని శక్తి మూలంగా కలిగినదే. అదే సత్సంగం యొక్క లాభం. భక్తులు, సన్మార్గంలో వున్న వ్యక్తులతో మెలుగుతున్నప్పుడు దుష్కృత్యముల దరిదాపులకు పోరాదన్న జ్ఞానం కలుగుతుంది. సత్సంగంలో దేవుని గురించిన ధ్యాస, ఆలోచన, అసాధారణమైన శక్తినిస్తుంది. ప్రతి ఒక్కటి భగవన్నిర్ణయమన్న మానసిక ధోరణి ఏర్పడుతుంది. అంతకంటే గొప్పదేమిటంటే, మనకు కోరికలు ఏవీ కలుగవు. అలాంటి నిర్భయత్వం, మనస్తత్వం భగవదేచ్ఛకు మనం సంపూర్ణంగా అంకితమైతే కలుగుతుంది. గ్రంథాలు, పుస్తకాలు చదవడం ఈ విషయంలో సహాయపడవు. మరో విధంగా చెప్పాలంటే అది మనం

అణకువగా వున్నప్పుడే సాధ్యపడుతుంది. ఆ ధోరణి దైవకృప ద్వారానే ఏర్పడుతుంది.

మనం ఎన్నింటికో అర్హులు కానప్పటికీ, అవి మనకు ప్రసాదించబడతాయి, ఎంతో ఆనందాన్ని లభింప జేస్తాయి. మనల్ని మనం భక్తులుగా భావిస్తాం. దేవుడిని తలచుకుంటామని అనుకుంటాం. కాని అది నిజం కాదు. సమస్యలు వచ్చినప్పుడే దేవుని గురించిన తలంపు వస్తుంది. కాని దేవుడు అవేవీ పట్టించు కోడు. ఆయనను స్మరించిన రోజుల్లో దేవుడు మన అర్హతను మించి సుఖాల్నిస్తాడు. ఆయన బిడ్డ చెడ్డవాడైనాడన్న కారణంగా తల్లి అతడిని నిర్లక్ష్యం చేయదు. మనం ప్రార్థించినప్పుడు దేవుడిని తలచు కున్నప్పుడు అలా జేయగలుగుతున్నప్పుడు ఆ భగవంతుని కృప వల్లనే జరుగుతోందని గ్రహించాలి. భగవాన్ రమణ మహర్షి తమ ఒకానొక ప్రార్థనా గద్యంలో ''అరుణాచలా! ఈ ప్రపంచంలో నిన్ను తలచుకొనని వారిలో నీకు సంపూర్ణశరణాగతి చెందని వారిలో అందరికంటే హీనుడిని నేను. నీ పాదపద్మాలకు సంపూర్ణంగా శరణాగతి చెందలేదు. అరుణాచలా! నీకు కష్టమంటూ ఏమున్నది? ఈ ప్రపంచ భారాన్ని మొత్తం నీవు మోస్తున్నావు. అన్ని బాధ్యతలూ తీసుకుంటున్నావు. అలాగే నా బాధ్యతను భరించు. నాకు బోలెడన్ని బాధలు, సమస్యలూ వున్నాయి. కాని నీకేదీ అసాధ్యం కాదు. ఇన్నాళ్ళూ భరించాను. ఇక నాకు చేత కాదు. ఇంకెంత కాలం నేను ఈ బరువును మోసుకోవాలి?'' అనే ధోరణిలో భగవాన్ ''అరుణాచలా! ఇక చాలు'' అంటారు. ఏ సహాయం లేనప్పుడే, బరువు మరింత ఎక్కువగా తోస్తుంది.

## అదృష్టం పరిష్కారమా?

మనకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు, బాధపడడం తప్ప మనం ఏమీ చేయలేము. ప్రపంచం ముగింపుకు వచ్చింది, అనుకునే సమయంలో, ఏదో జరుగుతుంది, సమస్య పరిష్కార మౌతుంది. అలా జరుగుతుందని అసలు అనుకోము. ఆ సందర్భాలలో అది మన అదృష్టం అనుకుంటాము. కాని ఈ 'అదృష్టం' అన్నది ఏమిటి? దేనికైన మనం వివరణ ఇవ్వలేని సమయంలో అదృష్టమన్నది అనిపిస్తుంది. ఒక్కొక్క సమయంలో మనం అసలు ఊహించని సమస్య ఎదురు కావచ్చు. అప్పుడు మన దురదృష్టమనుకుంటాం. ఆ క్షణంలో మనం వినమ్రులమవుతాము. ఎందుకంటే, ఏదీ మన చేతుల్లో లేదు అని గుర్తిస్తాం. "నా శిరస్సు నుండి ఈ ప్రపంచపు భారాన్ని తొలగించు ప్రభూ! ఇది నా ప్రార్థన. నీ పాదపద్మాల సన్నిధి నుండి నన్ను తొలగించకు" అని భగవాన్ అంటారు. ఆయన "నీ పాద పద్మాల నుండి నన్ను తొలగిపోకుండ చూడు" అని అనలేదు. భగవంతుని పాదసన్నిధిలో, వుంచమని కోరగల భక్తి భగవంతుడు మాత్రమే ప్రసాదించగలడు. మనం భగవంతుని పట్ల భక్తి చూపలేము; ఆయనే మనకు ఇవ్వాలి. ఆయన పట్ల మనం భక్తిని ప్రదర్శించే క్షణంలో మనం భక్తులమా కాదా అని నిశ్చయించడానికి ఇతరులెవ్వరూ వుండరు. నిజంగా నేను నిన్ను ప్రేమించిన వెంటనే, నేను ఆ విషయాన్ని చెప్పనక్కఱలేదు. నీతో నా ప్రవర్తన వల్ల ఆ విషయం నీకు తెలుస్తుంది.

ప్రేమ అన్నది సంకేతాల వల్ల, కళ్ళ ద్వారా ప్రకటించవచ్చు. దానికి పలుకులు అవసరం లేదు. నేను ఏదైనా ఒక వ్యక్తిని ఎంతగా ప్రేమిస్తున్నానని ఎవరికైనా చెప్పగలనా? నేను ఒక గంట కాలం పాటు మాట్లాడవచ్చు; కాని ఆ వ్యక్తి పట్ల చాలా ప్రేమ వున్నప్పుడు, దాని తీవ్రత మాటల మాధ్యమం ద్వారా వ్యక్తపరచడానికి వీలు కాదు. మీ పట్ల నాకు కోపముంటే, నేను మీకు చెప్పక్కఱ లేదు; నా ముఖ కవళికలను బట్టి మీకు తెలుస్తుంది. అలాగే మీరు ఏ విషయం గురించి గాని దుఃఖపడుతుంటే, నేను ఆ బాధ గురించి చాలా వ్యసనపడుతుంటే, నేను మాట్లాడాల్సిన పని లేదు. మీకు బాగా పరిచయస్థులైన వారు బహుదుఃఖంలో వుంటే అతని చేతిని కలపడం కంటే అధికంగా ఏమీ పని లేదు. లేదా ఆ వ్యక్తి కళ్ళల్లోకి చూస్తే, అది పదకోశం లోని అన్ని పదాలను వాడిన దానికంటే అధికమైన సముదాయింపు అతనికి కలుగుతుంది. అదే విధంగా దేవుని పట్ల మనకు భక్తి వుంటే ఆ విషయం ఆయనకు చెప్పనవసరం లేదు. ఆయనకు తెలుసు.

## హృదయ భాష

హృదయం యొక్క భాష మౌన భాష; ఎందుకంటే మన హృదయంలోని భావనలను మామూలు పదాల ద్వారా తెలియ పరచలేము. ''అరుణాచలా! నేను పనికిమాలిన వాడిని. నేను ఎన్నో కార్యాలు చేస్తున్నాననుకుంటున్నాను. నా బరువులను వదలించు కోవాలనుకుంటున్నాను. అరుణాచలా! నన్ను ఎల్లప్పుడూ నీ పాదపద్మాల దాపునే వుండనివ్వు'' అని భగవాన్ అంటారు. మరో

విధంగా చెప్పాలంటే మనం ఎల్లప్పుడూ అరుణాచల పాద సన్నిధిలో వుండలేము. ఆయనే తలచుకుని అక్కడ మనల్ని వుంచుకోవాలి. అంతే, మన ప్రయత్నాల కారణంగా మనం ఆయన పాదాల దాపున వుండలేము. భగవంతుడే స్వయంగా మనల్ని తన చరణాల దగ్గర వుంచుకోవాలి.

మనం ఎవ్వరి పాదాల దగ్గర వున్నప్పుడు, మనం అతని అధీనం, రక్షణలో వుంటాం. అంటే, అతని శరణు వేడామన్న మాట. దాన్ని గమనించిన ప్రజలు ఎవరి శరణు పొందామో వారిని తాము గౌరవిస్తున్న వారిగా గుర్తిస్తే, మనకు ఏ హానీ జరగదు. మన గురువు సన్నిధిలో వున్నప్పుడు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేస్తాం. అది ఒక సంకేతపూర్వక చర్య. కేవలం శరీరమే కాదు, మనసు కూడ గురువుకు స్వాధీనమౌతుంది. ఆ క్షణంలో, ముఖాన్ని భూమి వైపు త్రిప్పి దండం లాగ పడివుండడంతో, మన సంపూర్ణ నిస్సహాయతను తెలుపుతాము.

గురువుకు పూర్తిగా శరణు చెందినప్పుడు, మనకు అవసరమైన దానిని ప్రసాదించడం ఆయన బాధ్యత. ఇంతకూ మనకు కావల్సిన దేమిటి? మానసిక ప్రశాంతత. మనఃపూర్వకంగా గురువు పాదాల చెంత మోకరిల్లినపుడు, తమ అనంతమైన కరుణతో మన ఆతురతతో వాంఛించే శాంతిని గురువు దయ చేస్తాడు. గురువు మనం శాశ్వతంగా ఆనందంగా వుండేలాగ ఆశీర్వదిస్తారనుకుంటే అది తప్పుడు ఆలోచన మాత్రమే అవుతుంది. అసలైన గురువు

ఎవరూ అలా చేయరు. తమ అవధిలేని కృపతో మనకు ఎదురయ్యే ప్రతి అనుభవాన్ని యథాతథంగా అంగీకరించే మానసిక స్థిరత్వాన్ని అనుగ్రహిస్తారు. ఏది సంభవించినప్పటికీ బాధ, భయం చెందకుండ వుండేలాగ చేస్తాడు. అలాగ గురు కృపవల్ల మనకు మానసిక ప్రశాంతత లభిస్తుంది. అంతే కాదు. ఒక్కొక్కసారి, మనం అనుకోకుండా అర్థరాత్రి మెలకువ వచ్చినప్పుడు, తిరిగి నిద్రించాలని అనుకున్నప్పటికీ, గురువు తప్ప మరే ధ్యాస కూడ రాదు. అప్పుడు అనుభవించే శాంతి చాలా కాలంపాటు అలాగే నిలిచిపోతుంది. ఏమిటి ఆ శాంతి? అది మనం శరణాగతి చెందినప్పుడు గురువు ప్రసాదించే ప్రశాంతత.

మనపై భగవత్కృప ప్రసరించినప్పుడు, మనకు సమస్యలు వున్నా, లేకున్నా అసాధారణమైన శాంతిని అనుభవిస్తాం. అసలు ఊహించనప్పుడు మనం సమస్యలను ఎదుర్కొనవచ్చు, కాని ఎలాగో అవి పరిష్కరించబడతాయి, మన ప్రయత్నం అసలు లేకుండ. అలాంటి సందర్భాలలో మనం అతిగా సంతోష పడతాం.

గురువుకు శరణాగతి చెందినప్పుడు, మన అసహాయతను తెలియజేసినప్పుడు, ఆయన అన్ని పరిస్థితులను ఎదురుకొనే అసాధారణమైన సమర్థతను మనకు ప్రసాదిస్తారు. మనం కేవలం ఆయన చేతిలోని పనిముట్టు మాత్రమేనని భావించినప్పుడు ఆ సమర్థత వస్తుంది. అందుకే ఎలాంటి ఆదుర్దా మనకు వుండదు. సకలం చేస్తున్నది ఆయనే.

దేనినైనా తీసుకునేందుకు మనం చేతిలో స్పూన్‌ను పట్టుకుంటే, దానితో తేనెను తీస్తున్నామా, లేదా ఆముదం నూనెను తీస్తున్నామా అన్న ప్రశ్న చెంచాకు రాదు. ఆ చెంచాకు సంబంధించి నంత వరకు, అది మన ఒక పనిముట్టు మాత్రమే, అలాగ అది సాక్షి మాత్రమే. అలాగే, దేవుడు మనకు అలాంటి మానసిక స్థితిని ఇస్తాడు. ఆయన మనల్ని పలు ఉపయోగాలకు వాడుకుంటాడు. కాని కర్తృత్వ భావం వుండదు. ఒక స్పూన్ లాగా మనం ఏదో చేస్తున్నామన్న భావన వుండదు. మనం కేవలం ప్రభువు యొక్క పని ముట్టు మాత్రమే.

## కారణం మన ప్రయత్నమా?

ఏదైనా పనిని మనం చేయడం లేదన్న అభిప్రాయం తెలుసు కున్న క్షణమే, అన్ని చింతలూ ఆగిపోతాయి. అప్పుడు అద్భుతంగా మన పని జరుగుతుంది. నిజానికి ఆశలున్న ఎంతో మంది కంటే మనం ఎక్కువ మెరుగ్గా పనిచేయగలం. అలాంటి వ్యక్తులు ఉత్సాహంగా కొత్త పోకడలను చూపగలరని అనుకుంటాం. కాని అది నిజం కాదు. అలాంటి ఉత్సాహం చూపగలవారు, దైవకృపచే, జరిగే ప్రతి ఒక్కటి భగవంతుని దయ వల్లనేనని నమ్మే వ్యక్తులు. దేవుని చేతిలో పనిముట్టును మాత్రమేనన్న భావనతో పనిచేసి నప్పుడు, పని విజయవంతమైనదా కాలేదా అని బాధ వుండదు. బరువులన్ని నా పై వుంచండి, నేను మోస్తానని భగవాన్ అంటారు.

రైలులో ప్రయాణించేటప్పుడు మనతో ఎక్కువ సామాను వుంటుంది. రైలు కూలీ, పెట్టెలో సామాను పెట్టిన తరువాత వాటిని మనం తల మీద పెట్టుకోము. రైలు, సామానుని, మనల్ని కూడ

తీసుకెళ్తుంది. అప్పుడూ బరువు వుంది, కాని బరువు లేదు కూడ. మనకు లక్షల్లో ధనం వస్తే మనం దాన్ని బ్యాంకుల్లో పెట్టుకుంటాం. దొంగతనం జరగవచ్చునని ఇంట్లో పెట్టుకోం. పెద్ద మొత్తంలో సొమ్ము ఒకరోజున ఇంట్లో వున్నప్పటికీ, మనం భయపడుతూనే వుంటాం. దాన్ని ఏదో ఒక రూపంలో బ్యాంకులో పెడతాం. అక్కడ అది భద్రంగా వుంటుంది. అప్పుడు దాని భద్రత బ్యాంకు బాధ్యత. మనకు సమస్యలు వున్నాయని భావించినప్పుడు, చింత మొదలౌతుంది. దైవకృప కారణంగా అవి దేవుని సమస్యలని భావిస్తే ఆయన వాటిని భరిస్తాడు.

భగవంతుని కృపతో, సమస్యల భారం ఆయన పరిష్కరిస్తాడన్న భావన కలిగితే, మనం ఒక స్పూన్ మాత్రమే అవుతాము. ఎవరూ ఎల్లప్పుడూ సంతోషంగానే వుండడం కుదరదు; అలాగే ఎల్లప్పుడూ దుఃఖపడుతూ కూడ వుండరు. కాని ప్రభువు శరణు జొచ్చితే, ఏమి జరిగినప్పటికీ, మనకు మనశ్శాంతి వుంటుంది. సమస్యల ప్రభావం మనపై వుండదు. సమస్యలను ఎదుర్కొనే అసాధారణమైన శక్తి వస్తుంది. కాని అది ఆయన కృప వల్లనే జరుగుతుంది.

**కర్మ అజ్ఞానానికి వ్యతిరేకం కాదు కనుక, కర్మ దానిని నశింప చేయలేదు. అంటే, ప్రతీ కర్మ యొక్క గుర్తింపు, ఉపాధులను ఆధారంగా చేసుకొని మాత్రమే ఉండును కనుక, కర్మలు అజ్ఞానాన్ని బలపరుస్తాయి. మరోవైపు, జ్ఞానమునకు, అజ్ఞానానికి ప్రత్యక్ష వ్యతిరేకత కలదు. జ్ఞానము మాత్రమే అజ్ఞానాన్ని నాశనమొనర్చ గలరు. చీకటిని వెలుతురు నశింపచేయునట్లు, అజ్ఞానమును జ్ఞానము నశింపచేయును.** - ఆది శంకరాచార్యులవారి ఆత్మబోధ

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీమతి సొరిస్

మల్లాది ఫణిమాల

## శ్రీరమణులకు సాటి ఎవరు ?

'సన్డే టైమ్స్'లో శ్రీరమణుల చిత్రపటాన్ని మొట్టమొదటిసారి చూచినప్పుడు, ''అర్ధనగ్నంగా ఫోటో తీయించుకోవటమే కాక, పత్రికల్లో కూడా ప్రచురింప చేసుకున్నారు!'' అని సొరిస్ గారు అనుకొన్నారు. శ్రీరమణుల పట్ల, వారి తత్త్వం పట్ల అయిష్టత కలిగిన సొరిస్‌కు భగవాన్ శ్రీరమణ మహర్షి అనే పేరు కూడా ఎంతో కృత్రిమంగా మరియు కటువుగా వినిపించింది. తన గొప్పను చాటి చెప్పుకోవటానికి అందరిచేత అలా పిలిపించుకుంటున్నారని ఆమె అభిప్రాయపడింది. ఏ వార్తాపత్రికలోనైనా శ్రీ రమణుల ఫోటో కనబడితే వెంటనే ఆ పేజీని తిప్పేసేవారు సొరిస్ గారు. చలం గారి కుమార్తె అయిన సొరిస్ వయస్సు 14 సంవత్సరములు. 14 ఏళ్ళ బాలికగా ఉన్నప్పుడు, శ్రీరమణుల రూపాన్నే భరించలేక పోయిన సొరిస్‌గారికి, పెరిగి పెద్దయ్యాక, మహర్షి సౌందర్యానికి సాటిగల సౌందర్యమే లేదని అర్థమయ్యింది. అది కేవలం అనిపించటమే కాక, వారి నిశ్చితాభిప్రాయంగా మారింది. సమ్మోహనకరమైన వారి దరహాసం, మృదుమధురమైన వాక్కు, వారి తలపంకించే తీరు, 'మాయను' చీల్చివేసే వారి చూపు వీటికి సాటిలేవని సొరిస్‌గారికి అర్థమయ్యింది.

## శ్రీరమణుల బోధ మరియు విభూతి యొక్క మహిమ

1936వ సంవత్సరంలో సౌరిస్‌గారి తండ్రిగారైన చలంగారు శ్రీరమణాశ్రమానికి వెళ్ళి శ్రీరమణులను దర్శించుకుని, తిరిగి వచ్చేటప్పటికి, సౌరిస్‌గారు తలనొప్పితో పడుకుని వున్నారు. తండ్రి గారి ప్రయాణం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి లేకపోయినా, "అరుణాచలం" అన్న మాట వినబడగానే సౌరిస్‌గారి మనస్సు ఆనందంతో నిండిపోయింది. తలనొప్పిని లెక్క చేయక, పక్కమీద నుంచి లేచి వెళ్ళి తండ్రి వద్ద కూర్చుని, వారు ఎంతో ఆసక్తికరంగా శ్రీ భగవాన్ గురించి, వారి బోధను గురించి వివరిస్తూ చెప్పిన మాటలన్నీ విన్నారు. తండ్రి చెప్తున్న మాటలు నిజానికి సౌరిస్‌గారికి తప్ప, అక్కడున్న మిగితా వారికి అర్థం కాలేదు. చిన్నతనం నుంచీ, ఆమెను, ఈ ప్రపంచమంతా నిజమా లేక కేవలం కలా అనే ప్రశ్న వేధిస్తూనే ఉండేది. మనసు వెనుక "నేను"ని అందుకోవటానికి, ఆమె, మనసే అడ్డుపడుతోందన్న విషయం గ్రహించినా, దానిని దాటడం ఎలాగో తెలియక సతమతమౌతున్న తరుణంలో ఆమె అన్వేషిస్తున్న సత్యానికి మార్గాన్ని శ్రీరమణుల బోధనలు చూపు తున్నాయని, తండ్రి చలం గారి మాటలు వింటే, ఆమెకు తెలిసింది.

తండ్రి చెప్పినదంతా విని తిరిగి పక్కమీద పడుకున్న సౌరిస్ గారిని సమీపించి, చలంగారు ఆశ్రమం నుంచీ తెచ్చిన విభూతిని ఆమె నుదుటి మీద వ్రాస్తూ, శ్రీ భగవాన్ నామాన్ని ఉచ్చరించ సాగారు. తండ్రి వేళ్ళ నుంచి ఆమె నుదుటిలోకి ఏదో చల్లని శక్తి ప్రవహిస్తున్నట్లు ఆమెకు అనిపించింది. అలా అనిపించిన

వెనువెంటనే ఆమె తలనొప్పి మాయమై పోయింది. ఆ తరువాత ఆమె "నేనెవడను" అనే పుస్తకాన్ని చదివి, అందులో చెప్పబడిన ఆత్మ విచారం చేసే పద్ధతిని అభ్యాసం చేయటం మొదలు పెట్టారు. అలా కొంతకాలం చేయగా చేయగా, మనసులోని ఆలోచనలన్నీ వాటంతట అవే అణగిపోయి, వారి హృదయం సంతోషంతో నిండి పోయిందని సౌరిస్‌గారు చెప్పారు.

## శ్రీరమణుల అనుగ్రహం లేనిదే సాధనలో సాఫల్యం దుర్లభం

కొన్నిరోజుల పాటు ఈ విధంగా ధ్యానం మరియు ఆత్మ విచారణ చేశాక, శ్రీరమణుల కరుణాపూరిత స్వరూపం, సౌరిస్‌గారి ముందు ప్రత్యక్షమయ్యింది. శ్రీరమణులను మునుపు ఎన్నడూ చూడకపోయినప్పటికి కళ్ళ ముందు వారి రూపాన్ని చూసినప్పుడల్లా, ఎప్పటినుండో బాగా పరిచయమున్న వారిని చూసిన అనుభూతి ఆమెకు కలిగేది.

శ్రీరమణుల స్వరూపాన్ని పక్కకి పెట్టి, ఆత్మ విచారణ కొనసాగిద్దామని ఎంత ప్రయత్నించినా, వారి కరుణాపూరిత స్వరూపం పదే పదే ఆమె మనసులో మెదులుతూనే ఉండేది. అలా ప్రయత్నించటం వృథా అని తెలుసుకున్న సౌరిస్‌గారికి రోజులు గడిచే కొద్దీ, మనసులో ఉత్పన్నమయ్యే ప్రతీ తలంపు, శ్రీరమణుల రూపంలో కరిగిపోతున్నట్టు అనిపించటమే కాకుండా, ఎన్నడూ ఎరుగని శాంతిని, సౌరిస్‌గారు పొందారు. మనస్సులో సదా మెదిలే శ్రీ భగవానుల రూపం, కేవలం తన ఊహ కాదనీ, అది శ్రీ భగవానుల అనుగ్రహం వల్లనే సాధ్యమయ్యిందని, వారి కృప

కటాక్ష వీక్షణం లేనిదే ఎంతటి తీవ్ర సాధనయైనా సఫలీకృతం కాజాలదని సౌరిస్‌గారు గ్రహించారు.

## శ్రీ రమణుల దర్శనం

పాల్ బ్రంటన్‌గారు వ్రాసిన పుస్తకం, "ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా" ని చదివినప్పటినుండీ, ఆమెకీ శ్రీ భగవానులను దర్శించాలన్న కోరిక గాఢమయింది. వారిని దర్శించాలన్న గాఢమైన కోర్కెతో ఒక సంవత్సర కాలం గడిపిన పిమ్మట, వారి తల్లిదండ్రులతో పాటు సౌరిస్‌గారు అరుణాచలం వెళ్ళారు.

శ్రీ రమణులు హాలులోకి ఉదయం 8 గంటలకు ప్రవేశించారు. చాలాకాలంగా తెలిసినట్టు, శ్రీరమణులు, సౌరిస్‌గారిని చూసి నవ్వారు. వారి చిరునవ్వుతో సౌరిస్‌గారిపై అనుగ్రహ వర్షాన్ని కురిపించారు శ్రీరమణులు. వారు చాలా కాలంగా ఆమె రాకకై ఎదురు చూస్తున్నారని ఆమెకు అనిపించింది. శ్రీరమణుల సన్నిధిలో, వారి ఎదురుగా కూర్చున్న కొద్దిసేపటి లోనే, ఆమె సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. 1930 దశకం చివరి భాగంలో మళ్ళీ వారి తండ్రిగారైన చలంగారితో బాటు సౌరిస్‌గారు శ్రీ రమణుల దర్శనానికి వెళ్ళారు. శ్రీ భగవాన్ సన్నిధిలో అంతులేని శాంతిని ఆమె అనుభవించారు. శ్రీరమణుల సన్నిధిలో, స్వర్గంలో ఉన్నట్టు అనిపించేది. శ్రీ భగవానులను వర్ణించటానికి ఆమె భాషా పరిజ్ఞానము చాలదని సౌరిస్‌గారు ఎన్నోసార్లు అనేవారు. శ్రీరమణులు సాధారణంగా మాట్లాడేవారు కారు. కానీ వారి

పెదవుల మీద నుంచి, ఒక్క మాట వస్తే, ఏ విగ్రహం నుంచో మాట వచ్చినంత ఆశ్చర్యంగా సౌరిస్‌గారికి అనిపించేది.

శ్రీరమణుల కళ్లు చీకట్లో కూడా మెరిసేవి అనియూ, వారు మన వైపు చూస్తే, ఆ చూపు ఒక బాణం వలే హృదయాంతరాళం లోకి దూసుకుపోయేది అనియూ సౌరిస్ గారు అనేవారు. సౌరిస్ గారు శ్రీరమణుల బోధనల పట్ల ఇంతగా ఆకర్షింపబడినప్పటికీ, ఆశ్రమంలో జరిగే కర్మకాండ ఆమెకు ఏ మాత్రం అర్థవంతంగా అనిపించలేదు. ఆశ్రమంలోని వారి ప్రవర్తన, సంప్రదాయం ప్రకారం అక్కడ వాళ్ళందరూ చేసే పూజలు, ఇవన్నీ ఆమెకు ఎంత మాత్రం నచ్చలేదు. ప్రసాదం అందుకోవటానికి ఎడమ చేయి జాపినందుకు, ఆశ్రమ పరిచారకులు ఆమెను కసురుకోవటం వలన, ఆమెకు ఎంతో బాధ కలిగింది. నాస్తికుల మధ్య పెరగటం వలన, ఆశ్రమంలో జరిగే కర్మకాండను సౌరిస్‌గారు ఎంత మాత్రం అంగీకరించలేకపోయారు. ఒకనాడు మేజర్ చాడ్విక్ భక్తితో హారతి తీసుకుని, విభూతినీ కుంకుమనీ నొసటికి అద్దుకోవటం సౌరిస్ గారు గమనించడం జరిగింది. హిందూ జన్మనెత్తిన "నాకే, ఆ హారతిలో అర్థం కనబడకపోతే, చాడ్విక్ వంటి పాశ్చాత్యునికి అంతకన్న ఎక్కువగానే అర్థరహితంగా కనబడాలి కదా" అని సౌరిస్ గారు అనుకున్నారు.

అంతేకాక, ఒకరోజు అర్చకుడు హారతి పళ్ళెం తేగానే శ్రీరమణులు హారతిని ఎంతో భక్తితో కళ్ళకి అద్దుకొని, విభూతినీ, కుంకుమని నుదుటికి రాసుకోవడాన్ని సౌరిస్‌గారు గమనించారు.

శ్రోత్రియ బ్రాహ్మణుడిలాగ శ్రీ భగవాన్ అట్లా ఎందుకు ప్రవర్తించే వారో సొరిస్‌గారికి అర్థమయ్యేదికాదు. ఈ లోకమంతా ఒక అర్థం లేని ఆటగా చూచే జ్ఞానియై ఉండి కూడా ఇంత భక్తిశ్రద్ధలతో హారతి కళ్ళకి అద్దుకుంటున్న శ్రీరమణులను చూసి, సొరిస్‌గారు ఇలా అనుకున్నారు. ''శ్రీ భగవాన్ ముందు మనమెంత'' వారు హారతి భక్తితో తీసుకుంటే కాదనటానికి మనమెవ్వరం? ఆ రోజు నుంచీ ఆశ్రమంలో పద్ధతుల పట్ల వారికున్న విముఖత అంతా దానంతట అదే మాయమైపోవటమే కాక, ఆశ్రమవాసులందరి పట్ల ఎనలేని వాత్సల్యంతో సొరిస్‌గారు మెలగగలిగేవారు.

అక్కడ ఉన్నప్పుడల్లా ఆమెకి ఆశ్రమం తప్ప మిగిలిన ప్రపంచ మేమీ లేదనిపించేది. శ్రీరమణులను విడిచి ఎక్కడికీ వెళ్ళాలని పించేది కాదు. వారి పాదాల చెంతనే ఉండిపోవాలని అనిపించేది. 1939లో శ్రీరమణాశ్రమం నుంచి తిరిగి వచ్చాక ఆమెకు యిల్లు ఒక జైలులాగ అనిపించేది. తిరిగి అరుణాచలం వెళ్లాలని గట్టిగా సంకల్పించుకున్నప్పుడు, సొరిస్‌గారికి శ్రీరమణులు కలలో కనబడి, ''ఎందుకు కలవరం?'' నేనెప్పుడూ నీతోనే ఉన్నాను'' అని అన్నారు. శ్రీరమణులు తమ భక్తులను ఎన్నడూ విడువరు అని చెప్పడానికి ఇంత కంటే నిదర్శనం ఏమి కావాలి?

1950వ సంవత్సరంలో సొరిస్‌గారి కుటుంబం శాశ్వతంగా అరుణాచలానికి తరలి వెళ్ళారు. వారు అరుణాచలం చేరుకున్న కొద్ది వారాలకే శ్రీరమణులు దేహాన్ని విడిచిపెట్టారు. శ్రీరమణులు దేహంలో లేనప్పటికీ, సర్వవ్యాపిగా ఉన్న ఆత్మనాథుడే మన గురు

రమణులు అన్న ఎఱుకని, సౌరిస్‌గారికి శ్రీ భగవానులు అనుగ్రహించారు. శ్రీరమణుల స్వరూపం పట్ల సౌరిస్‌గారికి ఉన్న ప్రేమ, అనుబంధం నెమ్మదిగా, హృదయ కుహరంలో సత్-చిత్-ఆనంద స్వరూపులై, నిత్యం వెలుగొందుతున్న అంతః గురువైన రమణులపై కేంద్రీకృతమయ్యేట్లుగా గురు రమణులు సౌరిస్‌గారిని అనుగ్రహించారు. అంతులేని ఆత్మానందంలో సౌరిస్‌గారు మునిగిపోయి, తరించడం, గురు రమణుల కృప చేత మాత్రమే సాధ్యపడింది.

[భగవాన్ లీలలు, అప్పటికీ, ఇప్పటికీ వింతగానే ఉంటాయి. సౌరిస్‌గారికి ఈశ్వరుడు మార్గనిర్దేశనం చేస్తున్న రోజుల్లో ఎన్. వీరేశలింగం గారనే టీచర్ భార్యతో సహా, చలంగారింటికి వచ్చారు. గిరిప్రదక్షిణం ఎలా వెళ్ళాలి? మాకు తెలీదు అని అడిగారు. భార్య నడవలేదని కూడా చెప్పారు.

చలంగారు "అవేమీ చూడకండి. భగవాన్‌కు నమస్కారం చేసి ఆవిడను కూడ తీసుకెళ్ళండి" అని దారి చెప్పారు. వారు అలాగే గిరి ప్రదక్షిణం చేసివచ్చారు. కాని ఆశ్చర్యం! "కాస్త దూరం ఎలా వెళ్ళాలని ఆలోచిస్తుంటె, ఒకాయన వచ్చి రోడ్డు మలుపు దగ్గర నుండి తోడు వచ్చి ప్రదక్షిణం చేయించి ఊరి బయటకెళ్ళి పోయారు. పేరు అడిగితే శివప్రకాశం పిళ్ళై అని చెప్పారు" అన్నారు. శివప్రకాశం పిళ్ళై అప్పటికి ఎప్పుడో చనిపోయారు!

ఇటువంటి సంఘటనలు ఈనాటికీ జరుగుతూనే వుంటాయి. భగవాన్ కృప అలాంటిది.]

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

### రెండవ అధ్యాయము

శ్రీ భగవాన్‌తో నాకు సాన్నిహిత్యం యెలా యేర్పడిందో, నేను శాశ్వత ఆశ్రమవాసినెలా అయ్యానో చెప్పిన తరువాత, నాకు కలిగిన అనేక అనుభవాలూ, శ్రీ భగవాన్ నాకు చెప్పిన అనేక విషయాలూ తెలుప ప్రయత్నిస్తాను. ఇవన్నీ ఒక వరుసక్రమంలో వుండవు కానీ, యిప్పుడు నాకు యెలా గుర్తుకు వస్తే అలా చెప్ప ప్రయత్నిస్తాను. నాకు యెంతో సన్నిహితుడైన స్నేహితుడి బలవంతాన యివన్నీ, యెంత వీలైతే అంత, గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

నేను ఆశ్రమంలో శాశ్వతంగా నివాసం యేర్పరుచుకునే ముందు, 1935 ప్రాంతంలో అనుకుంటాను, నేనొక తాటాకు గదిలో వుండేవాడిని. ఈ గది, నేను తరువాత కట్టించుకున్న గది వరుస లోనే, 5-6 గదులు వరుసలో వుండేది. ఒక రోజు తెల్లవారు ఝామున, నాలుగు గంటల ప్రాంతంలో, శ్రీ భగవాన్ నాకు కలలో కనిపించి, నీకు ఉదయమే లేవాలి అనే పాట రాదా? అని స్పష్ట మయిన స్వరంతో అడిగారు. నాకు, శ్రీ భగవాన్ నన్ను వెంటనే లేచి తన దగ్గరకు రమ్మంటున్నారన్నట్లుగా అర్థమయింది. ఈ పాటను వీధి అరుగుల మీద నడిపే పాఠశాలలో విద్యార్థులు పాడుతారు. ఆ పాట మొదలు మాత్రమే నాకు తెలుసు. దాని అర్థ మేమిటంటే, 'తెల్లవారు ఝామునే లేచి, స్నానాదులు గావించి,

విభూతి ధరించి, షణ్ముఖుడైన సుబ్రహ్మణ్య స్వామిని పూజించు'' అని. శ్రీ భగవాన్ ప్రాతఃకాలం 3.30-4.00 గంటలకు లేచేవారు. కొంతమంది భక్తులతో కలిసి కూరగాయలు తరిగేవారు. 5.00 గంటలకు వేద పారాయణ జరిగేది. పారాయణ తరువాత శ్రీ భగవాన్ స్నానానికి వెళ్ళేవారు. ఈ మేలుకొలుపు కాగానే, నేను వెంటనే లేచి, స్నానాదులు గావించుకుని, పరుగున పోయి శ్రీ భగవాన్‌కు సాష్టాంగ నమస్కారము చేశాను. వారు నన్ను చూసిన వైనములో ''అవును! నీవు రావాలని నా ఉద్దేశ్యము. నీ కోసం యెదురు చూస్తున్నాను'' అనే అర్థం గోచరించింది. అంతే! ఇంకేమీ జరగలేదు. వారితో కూర్చొని, పారాయణము విని, నా గదికి తిరిగి వచ్చాను.

మరుసటి రోజు కూడా, నేను తెల్లవారు ఝామున నాలుగు గంటలకు వారి ఆనతి ప్రకారం శ్రీ భగవాన్ వద్దకు వెళ్ళవలెనను కొని, ఎంతో కష్టము మీద మళ్ళీ వెళ్ళాను. ముందురోజు లాగానే శ్రీ భగవాన్ కూరలు తరుగుతున్నారు. కానీ, వారు నా వైపు చూసిన తీరు నాకు, ''ఇదేమిటి! మళ్ళీ యీ రోజు కూడా యెందుకు వచ్చావు?'' అన్నట్లుగా అనిపించింది. అందువలన, ఆ తరువాత, వేకువనే నిద్ర లేవడం మానుకొని, అంతకు ముందు పద్ధతే కొనసాగించాను. ఏ రోజైతే, శ్రీ భగవాన్ నన్ను ఉదయాన్నే లేచి తన దగ్గరకు రమ్మని పిలిచారో, ఆ రోజు నుండి నన్ను తన వాడిగా స్వీకరించారనేది నా నమ్మిక. నా బాగోగులు యిక వారే చూసు కుంటారన్న ధైర్యం నాకు కలిగింది. వారనే 'నేత్ర దీక్ష' అనేది యిదే అని నా భావన.

1939 ప్రాంతంలో, నా వేసవి సెలవుల్లో నేను ఆశ్రమంలో గడుపుతున్నాను. నా గది యింకా నిర్మింపబడ లేదు. నేను యోగి రామయ్యగారి గదిలో వుంటున్నాను. హైదరాబాద్ వాస్తవ్యులైన డా. మేల్‌కోటే గారు ఆశ్రమానికి యెదురుగా వున్న యిళ్ళల్లో, ఒక దానిలో వుండేవారు. ఒకరోజు ఉదయము, 8 గంటల ప్రాంతంలో, నా కంట్లో ఒక నలుసు పడింది. ఎంత ప్రయత్నించినా పోలేదు. డాక్టరు గారు నన్ను పరీక్షించి, నలుసు గట్టిగా గుచ్చుకు పోయిందనీ, నన్ను ఆసుపత్రికి తీసుకు వెళ్ళవలసి వస్తుందనీ నిర్ణయించారు. ఆసుపత్రిలో వున్న పరికరాలతోనే నలుసును తీయడం సాధ్యమవు తుందని వారి ఆలోచన. అది కూడా వీలుకాకపోతే వెంటనే మద్రాసు వెళ్ళి చికిత్స చేయించుకోవలసి వస్తుందనీ, లేకపోతే కన్ను శాశ్వతంగా దెబ్బతింటుందనీ నన్ను హెచ్చరించారు. నా చుట్టూ కొంతమంది సందర్శకులు గుమిగూడారు. వారిలో ఒకరికి, డా. మేల్కోటే గారు చెప్పినట్లు గానే కన్ను దెబ్బతిన్నది. జాగ్రత్త తీసుకోక పోతే అలాగే జరుగుతుందని, ఆయన కూడా నన్ను హెచ్చరించారు.

నేను తీవ్రమైన మనోవ్యథకు గురి అయ్యి మానసికంగా శ్రీ భగవాన్‌తో మొరపెట్టుకున్నాను: ‘‘మీ సన్నిధిలో ప్రశాంతమయిన జీవితము గడుపుదామనే ఉద్దేశముతో యిక్కడకు వచ్చాను. నాకు యింత బాధ కల్పించి మద్రాసు పంపించాలనేది మీ ఉద్దేశమా?

ఈ ప్రార్థన చేసుకున్న తరువాత, డాక్టరుగారితో, ‘‘ముందు కంట్లో ఒక చుక్క ఆముదము వేసి చూస్తాను. దానితో నలుసు

బయటకు వచ్చేస్తుందేమో! అప్పటికీ రాకపోతే, హాస్పిటల్‌కు వెళ్దాము'' అన్నాను. డాక్టరుగారు కూడా ఒప్పుకున్నారు.

ఇద్దరమూ కలిసి శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళాము. రోజూలాగానే, ఉదయపు వ్యాహ్యాళికి వెళ్ళి వచ్చి సోఫాలో ఆనుకొని కూర్చొని వున్నారు. భగవాన్‌కు నోటితో నా బాధ చెప్పలేదు కానీ, మనస్సులో మళ్ళీ నా ప్రార్థన చెప్పుకొని, శ్రీ భగవాన్‌కు సాష్టాంగ ప్రణామము చేశాను. శ్రీ భగవాన్ పరిచారకుని వద్ద కొద్ది ఆముదము తీసుకొని, డా. మేల్కోటే గారితో నా గదికి బయలు దేరాను. ప్రస్తుతము ఆసుపత్రి వున్న ప్రాంతానికి వెళ్ళేసరికి, నా కంటి బాధ చాలా తగ్గిన భావన కలిగింది. నొప్పి త్వరగా తగ్గిపోతున్నట్లనిపించింది. ఈ విషయం డాక్టరు గారికి చెప్పాను. ఉపశమనం యెలా కలిగిందో ఆయనకు అర్థం కాలేదు. ఏమైనా సరే, యింకొకసారి కంటిని పరీక్షించి, ఆముదపు చుక్కవేసి ఆసుపత్రికి వెళ్దామన్నారు. గదికి వెళ్ళి, నా కంటిని పరీక్షించినపుడు, ఆదుర్దా పడాల్సిన అవసరమేమీ కనిపించలేదు. వారు నన్ను పరీక్షించే ముందే, ''ఇప్పుడు నా కంట్లో యేమీ లేదు. నాకు పూర్తిగా తగ్గిపోయింది'' అన్నాను.

ఆముదపు చుక్క వేయవలసిన అవసరము కూడా లేకపోయింది. డాక్టరుగారు, ''నాకేమీ అర్థము కావడము లేదు. నలుసు ఎలా పోయిందో మీకు బాధ యెలా మాయమయ్యిందో మనకు తెలియదు. ఇదంతా మీ భగవాన్ మహిమే'' అన్నారు. శ్రీ భగవాన్ కరుణ కాకపోతే, ఆ నలుసు పోవడానికి వేరే కారణం కనిపించదు. *(సశేషం)*

# కృతజ్ఞత

(మౌంటెన్‌పాత్ పత్రిక (సంపుటి-53, సంచిక-4)లో "గ్రాటిట్యూడ్" అన్న శీర్షికతో ప్రచురితమైన సంపాదకీయం యొక్క స్వేచ్ఛానువాదం)

**అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి**

చువాంగ్ జూ అనబడే ఒక చైనా సాంప్రదాయ జ్ఞాని చెప్పినట్లుగా భావించే ఒక కథ ప్రచారంలో ఉంది. అన్ని కథల విషయంలోలాగ ఈ కథ కూడ ఎన్నో మార్పులు, రూపాంతరాలకు లోనైనప్పటికి, ప్రధాన కథాంశం ఇలా ఉంటుంది.

ఒక గ్రామంలో అందరితో వివేకవంతుడనిపించుకునే ఒక వృద్ధుడు ఉండేవాడు. అతనికి జీవితంలో అతి ప్రీతిపాత్రమైనవి, ఎంతో ఆసక్తిని కలిగించేవి రెండే - తన గుఱ్ఱాలు, ఎంతో ప్రేమించే తన కొడుకు. ఆ తండ్రి కొడుకులకు ఇద్దరికీ కూడ గుఱ్ఱాలపై అమిత ప్రేమ, అతి మోహము. గుఱ్ఱపు స్వారీ చేస్తూ దూరప్రాంతాలకు పోయివస్తుండేవాడు. ఆనందకరమైన కుటుంబం, అతి ఖరీదైన గుఱ్ఱాలు కలిగిన ఆ వృద్ధుని అదృష్టవంతుడని అందరూ భావించేవారు. అదే విషయాన్ని గురించి సన్నిహితులు మెచ్చుకున్నప్పుడు అతను మాత్రం గూఢార్థం తోచే విధంగా "అదృష్టమా? ఏమో, కావచ్చు, కాకపోవచ్చు" అన్నాడు.

ఒకరోజు అతను అమితంగా ప్రేమించే ఒక మగ గుఱ్ఱం తప్పిపోయింది. ఆ వార్త విన్న చుట్టు ప్రక్కల వాళ్ళు తమ సంతాపం, సానుభూతులను తెలియజేస్తూ, అంత విలువైన గుఱ్ఱాన్ని పోగొట్టుకొనడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. కాని విచిత్రంగా ఆ

వృద్ధుడు ఏమీ కలత చెందని ధోరణిలో “ఏమో, కావచ్చు, కాక పోవచ్చు” అన్నాడు. ఎలాగూ తప్పించుకుంది, గుఱ్ఱం ఇక రాదు, దాని గురించి ఇక ఏమీ చేయలేము. అలా జరిగింది, అంతే అన్నాడు. ఇతరులు కూడ స్వంతదారుకు లేని బాధ తమకెందుకని ఊరకున్నారు.

కొంతకాలం తరువాత తప్పిపోయిన గుఱ్ఱం అతి మేలుజాతికి చెందిన ఒక ఆడగుఱ్ఱపు పిల్లతో సహా ప్రత్యక్షమైంది. మళ్ళీ చుట్టు ప్రక్కల వాళ్ళు వృద్ధుని దగ్గరకు చేరి “నీది ఎంత అదృష్టం!” అని శుభాకాంక్షలు తెలిపారు. కాని అతని జవాబు తిరిగి అదే! “ఏమో, అవునో, కాదో, అలా జరిగిపోయింది. గొప్ప అదృష్టంగా భావించడం లేదు” అన్నాడు. ఏమీ పాలుపోని జనం వెళ్ళిపోయారు.

## అదృష్టమా - అవునో, కాదో

ముద్దుగా ఉన్న ఆ గుఱ్ఱం పిల్లను తెగనచ్చిన ఆ వృద్ధుని కొడుకు దానిపై తరచు స్వారీ చేస్తుండేవాడు. పచ్చిక బయళ్ళలో స్వారీ చేస్తున్నప్పుడు ఆ గుఱ్ఱం పిల్ల ఒకరోజు జారిపడి, క్రిందపడిన ఆ కుమారుడి మీదకు దొర్లడంతో అతని కాలు విరిగింది. దాంతో అప్పటి నుండి కుంటుతూ నడిచేవాడు. చుట్టుప్రక్కల వాళ్ళు యువకుడు అవిటివాడైనందుకు పశ్చాత్తాపాన్ని ప్రకటించి ఎంత దురదృష్టం అని చింతించారు. వృద్ధుడు మాత్రం నిర్వికార ధోరణితో “ఏమో, కావచ్చు, కాకపోవచ్చు” అన్నాడు. అంతటితో ఊరకుండక వాళ్ళు ఆ చిన్న గుఱ్ఱంలో దోషముందని, దురదృష్టాన్ని తెచ్చిందని, దాన్ని చంపమని లేదా అమ్మమని సలహా ఇచ్చారు. కాని అతను

ఆ రెండింటిలో ఏదీ చేయలేదు. కొడుకు పరిస్థితి వల్ల దుఃఖం కాని, గుఱ్ఱంపై కోపం కాని లేదన్నాడు. అతడిని ఒక మూర్ఖుడిగా భావించి వెళ్ళిపోయారు.

కొన్నేళ్ళ తరువాత శత్రువులు ఆ దేశంపై దండెత్తి యువకుల నందర్ని సైన్యంలో బలవంతంగా చేర్చాలని ఆజ్ఞాపించారు. వృద్ధుని కుమారుడు వికలాంగుడైన కారణంగా అతడిని సైన్యంలో చేర్చుకోలేదు. అతి ఘోరమైన ఆ యుద్ధంలో గ్రామానికి చెందిన ఎందరో యువకులు చనిపోయారు. అలాగ ఈ యువకుడు తప్పించుకున్నాడు. గ్రామంలోని వారు వృద్ధుని చూసి ఎంతో అసూయపడి అదృష్టవంతుడని అన్నారు. అదృష్ట, దురదృష్టాలకు ఎప్పుడూ చలించని ఆ వృద్ధుడు మళ్ళీ "ఏదో అలా జరిగిపోయింది" అని జవాబిచ్చాడు.

## భవిష్యత్తును బేరీజు వేయలేము

అలాంటి సందర్భాలు మనందరి జీవితాల్లో సంభవిస్తాయి. ఆపత్కరము, దురదృష్టకరము అని భావించిన సంఘటనలే, ఆ తరువాతి కాలంలో ఎంతో లాభదాయకమైనవిగా పరిణమించ వచ్చు. దానికి వ్యతిరేకమైన సందర్భాలు కూడ ఏర్పడవచ్చు. ఎంతో శుభప్రదమని అనుకున్నవి అతి దుఃఖకారకాలు కావచ్చు. సంకుచితము, అతి పరిమితము అయిన మన మనస్సులతో సంభవించబోయే విషయాలను విస్తృతంగా గమనించి బేరీజు వెయ్యలేము. తరువాతి వారం, లేదా సంవత్సరం కాదు, ఆ మాట కొస్తే ప్రక్క క్షణం ఏమి జరుగుతుందో తెలుసుకోలేని మనం ఇప్పుడు

జరుగుతున్న విషయాలు భవిష్యత్తులో ఎలా పరిణమిస్తాయో ఎలా తెలుసుకొనగలం? కళ్ళు కూడ తెరవని చిట్టెలుకల్లాగ అలా సాగి పోతుంటాము, అంతే. గురుకృప లేకుంటే అదే పరిస్థితి.

గురువు మనకు బోధనల ద్వారా నిరంతరం మార్గదర్శకత్వము చేస్తుంటారని నమ్మకంగా తెలుసుకునేందుకు వారి పట్ల కృతజ్ఞతా భావము కలిగివుండడమే సరియైన ధోరణి. ఆ విషయాన్ని మనము వెంటనే గుర్తించకపోవచ్చు. మనకు సంభవించే ప్రతి సంఘటనతో మంచి జరిగే అవకాశం ఉందని నమ్ముతాము. సరియైన నమ్మకము "శ్రద్ధ" ఉంటే, కృప మనపై ప్రసరించి తీరుతుందని రూఢి అవుతుంది. హృదయాన్ని బంధించి ఉంచితే భగవాన్ కృపను ఎలా అందుకోగలుగుతాం?

ఈ జీవన ప్రయాణాన్ని నదిలోని పడవ ప్రయాణంతో పోల్చ వచ్చు. నీళ్ళు ఎక్కడ ప్రమాదం లేకుండ నెమ్మదిగా ప్రవహిస్తున్నాయి, ఎక్కడ ఉధృతంగా, ఉపద్రవంగా పారుతున్నా యని మనము గ్రహించలేము. కాని, పై ఎత్తున ఆసీనులైన గురువు పడవ ప్రయాణాన్ని ఆసాంతం పరికిస్తూనే ఉంటాడు. ఇక మన జీవితాన్ని ఇతరుల జీవితాలతో పోల్చి చూసుకునే వైఖరి అందరిలో ఉంటుంది. నిజమే, కొందరికి ఎక్కువ ధనము, ఎక్కువ మంది మిత్రులు, మెరుగైన ఆరోగ్యమూ ఉండవచ్చు. ఈ భావనే మన అంతరంగాలపై విషంలా పనిచేస్తుంది, ద్వేషాన్ని రేకెత్తిస్తుంది. మనం ఓడిపోయామనుకుని మన స్థిమితాన్ని కుదిపేస్తూ, మన మీద మనకే ఏహ్య భావన కలిగిస్తుంది. దీనికి విరుగుడు కృతజ్ఞతా భావన కలిగి

వుండడం ఒక్కటే. మన మీద వర్షింపబడిన దీవెనలను అనుభవిస్తూ కూడ వాటిని గుర్తించకపోతున్నామని మనము సవినయంగా గమనిస్తే భగవంతునికి ఎంతో ఋణపడి వున్నామన్నది విశదమవుతుంది.

ఈ ప్రపంచంలో ఏదిగాని ఉచితంగా లభించడం అరుదు. గురుకృప, దైవకృప ఉచితంగా లభించేవే కాని అది శాశ్వతంగా లభించేందుకు మనము శ్రమపడాల్సిందే. ఒక దీవెన అన్నది ప్రారంభం మాత్రమేనని గుర్తుంచుకుంటే, దారిచూపే ఆ వెలుగు బాటను వీడకుండ నడవడము, అలా ప్రవర్తించడమూ మన బాధ్యత అని తెలిసి వస్తుంది. మరి ప్రస్తుతము అదృష్టవంతమైనదిగా కనిపించే పరిస్థితి విపత్తుగా పరిణమిస్తుందని గుర్తించడము ఎలాగ? రెండింటికీ అవకాశాలున్నాయని మనము నిరంతరమూ జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి. దాన్ని మరచి విశ్వాస ఘాతుకతతో దారి తప్పకూడదు. ఘోరమైన దుర్ఘటన జరిగినప్పుడు క్రుంగిపోయి, ఈ సన్మార్గాన్ని వీడడము గాని, ఆనందదాయకమైన పరిస్థితు లేర్పడినపుడు, లేదా అనుకోని క్షణంలో పరిస్థితి అనుకూలమైతే సంతోషంతో పొంగిపోవడము గాని మంచిది కాదు.

## మంచి, చెడులు తప్పవు

జీవితములో సుఖ దుఃఖాలు, గెలుపు ఓటములు సంభవించక తప్పవు. ఒకరకంగా చూస్తే చేదు అనుభవాలే మనకు చక్కటి మార్గదర్శకాలు. ఎందుకంటే అప్పుడు మనకు సరియైన అవగాహన ఏర్పడి, మంచి చెడులను గుర్తించే మనఃపక్వత ఏర్పడు

తుంది. ఈ అవగాహనను కలుగజేసినందుకు మనము ఎంతో కృతజ్ఞతను ప్రదర్శించుకోవాలి. దానివల్ల అనవసరమైన బాధలు, దుఃఖాల నుండి తప్పించుకోవచ్చు. వైరాగ్యానికి తొలిమెట్టు ఈ భావన కలిగివుండడమే. భగవాన్ నిర్దేశించిన మార్గాన్ని అనుసరించినప్పుడు మన మార్గదర్శక సూత్రాలు, ప్రాధాన్యతలు మారతాయి. వస్తు సముదాయ సంపాదనకు బదులు వాటిని వదిలించుకోవాలన్నది నేర్చుకుంటాము. అదుపులో ఉంచుకోవాలనే ప్రయత్నాల కంటే, పరిస్థితుల తీరుతెన్నులను ఉన్నవాటిని ఉన్నట్లు గ్రహించడం నేర్చుకుంటాము. విపత్తు ఎదురైనప్పుడు దాని గురించి ఫిర్యాదు చేయకుండ, మన అజ్ఞానాన్ని గుర్తించడానికి, విచక్షణ, వైరాగ్యాలను అలవరించుకునేందుకు అది ఒక అవకాశమని భావించడం నేర్చుకుంటాము.

మన జీవితాలను గురించి పునరాలోచన చేసి చూస్తే, కొన్ని సంఘటనలు ఆయా సమయాల్లో ఎంతో వినాశకరమైనవని అప్పుడు అనిపించినప్పటికి, ఆలోచించి చూసినప్పుడు అలాగ జరగడము ఎంత ఉత్తమైనవిగా పరిణమించాయో గమనిస్తాము. ‘‘అది కూడ మన మంచికే’’ అన్నది ఒక యూదుల లోకోక్తి. బాహ్యంగా ఆ సమయంలో చెడుదిగా భావించే సంఘటనను కూడ మంచిదిగా భావిస్తే, ఎవరికి తెలుసు తరువాతి రోజుల్లో దాని వల్ల శుభం జరగవచ్చు.

## అన్నీ మన మంచికే

వివేకి ప్రతి క్షణాన్ని, సందర్భాన్ని మంచిదిగా, ఆహ్వానించదగినదిగా అంగీకరిస్తాడు. తన గర్వం, ఈర్ష్య, ద్వేషం, తమస్సుల

కారణంగా ఈ సత్యాన్ని గ్రహించని వ్యక్తి నిజమైన మూర్ఖుడు. మన జీవితాలలో, ఇలాంటి రెండు తత్వాలను ప్రదర్శించే వాళ్ళు తారసపడతారు. మనం వివేకవంతుల వైపు మొగ్గు చూపుతాము. అలాంటప్పుడు శుద్ధ ప్రకాశరూపమైన భగవాన్ పట్ల మనం మరెంతో వివేకంతో నడుచుకోవాలి కదా! కాని భగవాన్ మాత్రం భయం లేదా కోరికల కారణంగా మనము అతి విలువైనదిగా అట్టిపెట్టుకునే ''అహంభావాన్ని'' మన ప్రత్యేక ''వ్యక్తిత్వాన్ని'' పట్టించుకోడు. ఆయన సూటిగా మన హృదయాల్లోనికి చూస్తూ, ఏది నిజం, ఏది కాదు, అని గమనిస్తాడు.

భగవాన్ శరీరంతో ఉన్న రోజుల్లో, ఎందరో సమస్యలను సృష్టించే జనమూ, ఇంకా ఒకరితో ఒకరు పోటీగా భగవాన్ దృష్టి లోనికి రావాలన్న తపన పడేవారు, ఉండేవారు. కాని భగవాన్ ఈ విషయాలను పట్టించుకునేవారు కాదు. మంట మీద ఉంచిన కుండ నుండి ఆవిరి వచ్చినట్లుగా, అలాంటి విషపూరిత ఆలోచన లన్నిటిని బయటికి తొలగిపోయేలాగ చూసేవారు.

భగవాన్ సన్నిధిలో కనకమ్మాళ్ గారు చాలాకాలం ఉన్నారు. ఇన్నేళ్ళు మీరు ఏమి నేర్చుకున్నారని అడిగితే, శరీరానికి అంత ప్రాముఖ్యత ఇవ్వరాదని భగవాన్ చెప్పారన్నారు. అంత వృద్ధాప్యంలో, బాధలు పడుతూ కూడ ఒకటి, రెండు గంటలు ఊరకే ఆయన సన్నిధిలో కూర్చునేందుకు ఎందుకు వచ్చేవారని అడిగితే, అది ఆయన పట్ల కృతజ్ఞత చూపడం కోసమేనన్నారు. దాన్ని గుర్తించి మనమూ భగవాన్ పట్ల కృతజ్ఞత చూపుదాం.

# Valmiki Ramayana

## Talk 68

Dr.K.Subrahmanain

*gurave sarva lokanaam bhishaje bhava roginam,*
*nidhaye sarva vidhyanam Dakshinamurthaye namah*
*koojantham rama ramethi madhuram madhuraaksharam*
*aaruhya kavitaashaakhaam vandhe valmiki kokilam*
*mangalam kosalendraya mahaneeya yugabdhaye*
*chakravarthi thanujaya sarva bhoumaya mangalam*
*yatra yatra Raghunaatha kirtanam*
*tatra tatra krta mastaka anjalim*
*vaasspa vaari paripuurnnaa locanam*
*Maarutim namata raakssasa antakam*
*mano javam Maaruta tulya vegam*
*jitendriyam buddhi mataam varisstha*
*vaata atmajam vaanara yutha mukhyam*
*shriraama dutam sharanam prapadye*

I have known Dr. Venkatratnam for some years, and he is a great Rama *bhakta*. When he asked me to speak on Sri Rama today, I told him I would be grateful if he could ask someone else. But he insisted, and that is why I am here today. I generally don't address public meetings, especially on religious subjects, because I believe that I am not competent to talk about spiritual matters. At Ramana Kendram, I talk about Bhagavan and my experience, valid or invalid. I believe that what is most important is one's personal experience. Today, I am here despite my resistance; it is the devotion of Dr.Venkatratnam that has made me accept this invitation.

The subject of today's talk is Rama, the embodiment of *dharma - Ramovigraha dharma*. We have all read the *Ramayana;* it is in the blood of almost everybody in the country. The extraordinary thing about Sri Rama was his adherence to *dharma* at all costs. As far as Krishna was concerned, he was the *purnaavatara*. He knew he was an *avatara*, and therefore, he did many things to prove that he was an *avatara*. As far as the Rama *avatara* is concerned, Valmiki depicts him as a model human being. Rama himself said:

*aatmaanam maanusham manye Ramam Dasharathaatmajam*

"I am Rama. I consider myself a human being. I am the son of Dasharatha."

We learn so much from the *Ramayana* because a person who considers himself a human being did extraordinary things, while adhering to *dharma* at all costs. Right from the beginning, Rama was a good and kind person. Valmiki lists all the qualities of Rama, and asks whether any human being has all these qualities. The very first word in Valmiki *Ramayana* is *tapas*. The entire *Ramayana* is about *tapas* - the *tapas* of Rama for Sita, the *tapas* of Sita for Rama, the *tapas* of Dasharatha for Rama, of Bharata for Rama, etc. Each one does *tapas* to get something or the other.

